క్లుప్తంగా

జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కార్డన్ సెర్చ్


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి చినముషిడివాడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ మద్యం షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. సీఐ సతీష్‌కుమార్ కాలనీ వాసులతో మాట్లాడుతూ కాలనీలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలను గమనించినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

పరవాడ: మండలంలో పి.బోనంగి గ్రామానికి చెందిన బిళ్లకుర్తి రమేష్ (41) శుక్రవారం సాయంత్రం పాము కాటుకు గురై మృతి చెందారు. వివరాలివి.. రమేష్ శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటి నుంచి పొలంలోకి నడిచివెళ్తుండగా గుర్తు తెలియని పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు రమేష్‌ను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


లీలాకృష్ణ

పెందుర్తి: మండలంలో కోటనరవ గ్రామానికి చెందిన దాడి లీలాకృష్ణ (27) ఈ నెల 1 నుంచి కనిపించడం లేదని అతని తల్లి దాడి మంగమ్మ శనివారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పెద్ద కుమారుడు దాడి లీలాకృష్ణ ఫిట్స్‌తో బాధపడుతున్నాడని, సెల్‌ఫోన్ కొనలేదని కోపంతో అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇంత వరకు తిరిగి రాలేదన్నారు. పరిసర గ్రామాలు, కుటుంబ సభ్యులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన లీలాకృష్ణ ఎత్తు 5.5 అంగుళాలు, చామన ఛాయ కలిగి, క్రీమ్ కలర్ టీషర్ట్, నీలి రంగు ఫోల్డింగ్ ట్రాక్ ధరించి ఉన్నాడని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే 9440796039 నంబరుకు సమాచారం అందించాలని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

నరవ ఐటీఐ టాపర్ రాహుల్‌కు అభినందన

కంచరపాలెం: కంచరపాలెం నరవ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో జరిగిన ఆలిండియా ట్రేడ్ టెస్ట్- 2025 పరీక్షా ఫలితాల్లో పి.వి.ఎస్.రాహుల్ అనే విద్యార్థి డీజిల్ మెకానికల్ ట్రేడ్‌లో 594/600 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా శనివారం నరవ ఐటీఐ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ బి.ప్రభాకర్, ట్రైనింగ్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి రాహుల్‌ను అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

పూల మొక్కలతో అందంగా తీర్చిదిద్దిన ఉద్యానవనం నేడు కళావిహీనంగా మారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. తొలినాళ్లలో విద్యుత్ దీపాలతో సందర్శకులకు కనువిందు చేసిన పార్కు నేడు అంధకారంలో చిక్కుకుని ఆకతాయిలకు ఆటవిడుపుగా మారింది. చీకటి పడితే విషప్రాణుల సంచారంతో అడుగు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

నిర్లక్ష్యపు నీడలో మినీ పార్కు

- తుప్పలు, డొంకలతో అడవిలా మారిన వైనం
- సందర్శకులకు అడుగుపెట్టాలంటేనే భయం



పరవాడ మినీ పార్క్


తుప్పల మధ్య చిక్కుకున్న బాలల ఆట వస్తువులు

పరవాడ: పరవాడలో లక్షల రూపాయలతో నిర్మించిన మినీపార్కు తుప్పలు, డొంకలతో అడవిని తలపిస్తోంది. పార్క్ నిర్వహణ బాధ్యతను పాలకులు గాలికి వదిలేయడంతో సందర్శకులు పార్క్‌లో అడుగు పట్టాలంటేనే హడలిపోతున్నారు.

లుపిన్ ఫార్మా సంస్థ ఏడేళ్ల క్రితం రూ.30 లక్షలు వెచ్చించి ప్రజలకు ఆహ్లాదం పంచేలా అన్ని సౌకర్యాలతో పార్కు నిర్మించింది. అయితే, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పార్కు కళావిహీనంగా మారింది. పార్కులో చిన్నారుల కోసం అమర్చిన జారుడు బల్లలు, ఉయ్యాల వంటి ఆట పరికరాలు తుప్పల మధ్య కనిపించడం లేదు. అవి ఎండకు ఎండి, వానకు తడిచి తుప్పు పట్టిపోయాయి. పార్క్ చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు తుప్పు పట్టి రాలిపోయాయి. విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి ఎక్కడికక్కడ విరిగిపోతున్నాయి. పెద్దల కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు తుప్పల్లో చిక్కుకుపోయాయి. పార్కు చుట్టూ వెలుగుల కోసం అమర్చిన ఎల్ఈడీ విద్యుత్ దీపాలు తుప్పు పట్టి నేల రాలిపోయాయి. పైగా, ఇక్కడ ప్రతీ మంగళవారం జరిగే వారపు సంతకు వచ్చేవారు, స్థానికులు ఈ పార్కును మరుగుదొడ్లగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ముందుకొచ్చి అందాల ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


తుప్పలు, డొంకలతో మినీ పార్క్

ఉద్యానవనాన్ని అభివృద్ధి చేయాలి



చక్కగా ఉండే పార్కును పట్టించుకోకుండా వదిలేయడంతో అధ్వానంగా మారింది. పిచ్చి మొక్కలు, తుప్పలతో లోపలికి వెళ్లే దారి కూడా లేకుండా పోయింది. మరీ దారుణమేంటంటే పార్కును టాయిలెట్‌గా మార్చేశారు. గతంలో ఎప్పుడైనా పార్కులో కాసేపు సేదతీరుదాం అనిపించేది. ఇప్పుడు అటు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని పార్కుకు పూర్వవైభవం తీసుకురావాలి.
– పైల రాము, స్థానికుడు, పరవాడ

చర్యలు తీసుకుంటాం



గ్రామ పంచాయతీలో నిధుల కొరత ఉంది. నిధులు సమకూరిన అనంతరం పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. సీఎస్సార్ నిధులు మంజూరు చేయాలని ఫార్మా పరిశ్రమలను కోరనున్నాం. వారు సహకరిస్తే పార్కును అభివృద్ధి చేస్తాం.
– మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి, పరవాడ

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి


మాట్లాడుతున్న తహసీల్దారు వెంకట అప్పారావు

పెందుర్తి: ఓటర్ల జాబితాలో తప్పులను గమనించిన వెంటనే పెందుర్తి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారికి తెలియజేస్తే సత్వరం పరిష్కరిస్తామని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, తహశీల్దారు ఐ. వెంకట అప్పారావు తెలిపారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో శనివారం నిర్వహించిన అఖిల పక్ష నాయకుల సమావేశంలో తహశీల్దారు వెంకట అప్పారావు మాట్లాడారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు కాకపోతే వారిని గుర్తించి బూత్ లెవల్ అధికారుల సహాయంతో వెంటనే ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. ఓటరు లిస్టులో మరణించిన వారి పేర్లుంటే తమ దృష్టికి తీసుకు రావాలని, విచారణ జరిపి అటువంటి పేర్లు తొలగిస్తామన్నారు. 18 ఏళ్ల వయస్సు కలిగిన యువత ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకుడు ఐ.ఎ. నాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముక్కు రామునాయుడు, టీడీపీ నాయకుడు ఉమామహేష్, జనసేన నాయకుడు వేణుగోపాల్ కిరణ్ పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి


వేంకటేశ్వరస్వామికి తులాభారం మొక్కు చెల్లిస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవల అనంతరం సహస్రనామార్చన, అష్టోత్తర పూజలు చేశారు. కొండ దిగువ నుంచి స్వామి సన్నిధి వరకు భక్తులకు వాహన సదుపాయం కల్పించామని ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. చాతుర్మాస దీక్షలో భాగంగా సుందర కాండ హవనం, శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. కొందరు భక్తులు తులాభారం మొక్కులు చెల్లించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి అందజేత


అంగన్‌వాడీ నిర్వాహకులకు వంట సామగ్రి అందజేస్తున్న డీజీఎం గిరిధర్‌భక్షి

పరవాడ: పిల్లల ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమని విశాఖ ఫార్మాసిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్‌భక్షి అన్నారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఫార్మాసిటీ సహకారంతో చినతాడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన సామగ్రిని ఆయన నిర్వాహకులకు శనివారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు రక్తహీనత నుంచి బయట పడటానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతున్నాయన్నారు. రాంకీ ఫౌండేషన్ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ఫౌండేషన్ అమలు చేస్తున్న సామాజిక కార్యక్రమాల్లో ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. దీంట్లో భాగంగా ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, 12 అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రిని సమకూర్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు త్రివేణి, రాంకీ ఫౌండేషన్ ఉమెన్ కో–ఆర్డినేటర్ ఎస్.రాజేశ్వరి, శ్రీనివాస్, శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పి కంటైనర్ బోల్తా


లంకెలపాలెం సమీపంలో బోల్తా పడిన కంటైనర్

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలో తాడి మూడు మదుంల సమీపంలో శనివారం తెల్లవారు జామున జరిగిన ఓ ప్రమాదంలో కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి.. కాకినాడ నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ పోర్టుకు లోడుతో వెళుతున్న భారీ కంటైనర్ తాడి మూడు మదుంల వద్దకు రాగానే, వాహనం టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదం తెల్లవారు జామున జరగడం, ఆ సమయంలో ప్రయాణికుల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బోల్తా పడిన కంటైనర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసినట్లు సీఐ తెలియజేశారు.

ప్రతి విద్యార్థి వ్యాపారవేత్తగా ఎదగాలి


ఆచార్య చంద్రమోహన్‌ను అభినందిస్తున్న ఆచార్య డాక్టర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం: ప్రతి విద్యార్థి వ్యాపారవేత్తగా ఎదిగితే భారత ఆర్థిక వ్యవస్థకు వారు బలమైన సైనికులుగా మారుతారని తమిళనాడు జాతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు చంద్రమోహన్ అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 'వ్యాపార వేత్తల లక్షణాలు, కార్పొరేట్ ప్రపంచంలో వారి నాయకత్వం' అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చంద్రమోహన్ మాట్లాడుతూ భారత ఆర్థికాభివృద్ధిలో అనేక సంస్థల వ్యవస్థాపకులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదగాలంటే సృజనాత్మకత, కొత్త ఆలోచనలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపార ధోరణులను అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు నాయకత్వాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరంలో వర్ష బీభత్సం


గొర్లివానిపాలెంలో నీటిలో చిక్కుకుపోయిన వాహనాలు

- నిలిచిపోయిన వాహనాలు
- కొట్టుకుపోయిన ఇళ్లలోని గ్యాస్ బండలు


కొట్టుకుపోయిన గ్యాస్ బండలను తీసుకొస్తున్న వ్యక్తి

సబ్బవరం: మండలంలో శనివారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గొర్లివానిపాలెం జంక్షన్ వద్ద కొండల నుండి వచ్చే నీరు భారీగా చేరి, డ్రైయిన్లు పూడుకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి రోడ్లు జలమయం అయ్యాయి. సబ్బవరం పోలీస్ స్టేషన్ సమీపంలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో ఎన్నడూ చూడనంతగా సబ్బవరం ముంపునకు గురైందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న గెడ్డవాగులను పూర్తిగా పూడ్చివేయడం, అభివృద్ధి చెందుతున్న సబ్బవరానికి దీటైన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకపోవడంతో ఈ అవస్థలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సబ్బవరంలో 126.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సందీప్ వినాయకవర్మ (ఫైల్)


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి మృతి చెందిన సందీప్ వినాయక వర్మ

పరవాడ: పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెం రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. ఈ ప్రమాదంలో సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన సాగిరాజు సందీప్ వినాయకవర్మ (27) ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారానికి చెందిన సందీప్ వినాయక వర్మ తన ద్విచక్ర వాహనంపై పెదముషిడివాడ నుంచి శుక్రవారం రాత్రి స్వగ్రామమైన పైడివాడ అగ్రహారానికి వెళ్తున్న క్రమంలో నక్కవానిపాలెం సమీపంలోని మలుపులో తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సందీప్ వినాయక వర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కావలసి ఉంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి శనివారం బంధువులకు అప్పగించినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

9 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తగరపువలస: విశాఖ జిల్లా జాలారిపల్లిపాలెం గంగవరం కబడ్డీ గ్రౌండ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.వి.ఎస్.ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అనుమతితో విశాఖ జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రబ్బర్ మ్యాట్లపై నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో విజయం సాధించే నాలుగు జట్లుకు జీవీఎంసీ 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఇతర దాతల సాయంతో జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి కింద రూ.15 వేలు ఇవ్వనున్నట్టు ప్రసాదరెడ్డి ప్రకటించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

పరవాడ: లంకెలపాలెం ఫ్లైఓవర్ సమీపంలో తాడి మూడు మదుంల వంతెన పైన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు శనివారం గుర్తించారు. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే గుర్తు తెలియని రైలు ఢీ కొట్టడం వల్ల ఆ వ్యక్తి మృతి చెంది ఉండొచ్చని జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. ఈ ప్రమాదంలో మృతుడు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. మృతుడు 5.5 ఎత్తు, నల్లటి జుట్టు, నలుపు రంగు హాఫ్ నిక్కరు కలిగి ఉన్నాడు. మృతదేహంపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. కుడి చేయి మణికట్టు వద్ద ఓం అని పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు 7382058996 నంబరుకు సమాచారం అందించాలని ఎస్ఐ లక్ష్మి కోరారు.

జూ కిటకిట


సీతాకోక చిలుకల పార్కు వద్ద సందర్శకులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. కుటుంబాలతో సహా జూ పార్కును సందర్శించి.. ఇక్కడి వన్యప్రాణులను తిలకించారు. తెల్ల పులులు, పెద్ద పులులు, నీటి ఏనుగులు, కోతులు, ఏనుగులు, పక్షులు, పాములు, జింకలు, జిరాఫీలు తదితర జంతువులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను కనువిందు చేశాయి. వివిధ రకాల పక్షులు కిలకిలరావాలతో అలరించాయి. జూలో ఆధునికీకరించిన లవ్ బర్డ్స్ జోన్, దాని అనుకుని కొత్తగా నిర్మించిన డక్ యావరీ సందర్శకులను ఆకట్టుకున్నాయి.


తెల్ల పులిని చూస్తున్న సందర్శకులు


నీటి ఏనుగును ఫొటో తీస్తున్న సందర్శకులు

భారీ ఎత్తున అన్నసమారాధన


అన్న ప్రసాదం వడ్డిస్తున్న గంట్ల శ్రీనుబాబు తదితరులు

సింహాచలం: అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద శ్రీగణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన దుర్గాదేవి మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం మూడువేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అన్న వడ్డన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే రాత్రి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు

పెందుర్తి: బాపూజీనగర్ దరి సాధుమఠం ప్రాంతంలో మేకలను మేపుతుండగా తనపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపరిచారని అదే ప్రాంతానికి చెందిన బసవబోయిన దేముడు శనివారం ఫిర్యాదు చేశాడని పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 2 మధ్యాహ్నం 3 గంటల సమయంలో తాను మేకలను మేపడానికి వెళ్లిన సమయంలో జగదీష్ అనే యువకుడు ఒక అమ్మాయితో కలిసి తిరుగుతుండగా ఆమె ఎవరని ప్రశ్నయించినందుకు తనపై దాడి చేసి గాయపరిచాడని దేముడు ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. మళ్లీ ఈ నెల 3న జగదీష్ తన ఇద్దరి స్నేహితులతో కలిసి వచ్చి తనను చంపడానికి ప్రయత్నించగా భయంతో పొదల్లో దాక్కున్నానని, ఆ సమయంలో అక్కడికి వచ్చిన పోలీసులను చూసి నిందితులు పరారయ్యారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. తన సిబ్బందితో కలిసి దేముడిపై హత్యాయత్నానికి పాల్పడిన కాకరవానిపాలేనికి చెందిన చుక్క జగదీష్, కొత్తవలస మండలం కొత్త సుంకరపాలేనికి చెందిన లెంక సాయికుమార్, ద్రోణంరాజునగర్‌కు చెందిన యాండ్రపు మహేష్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ సతీష్‌కుమార్ చెప్పారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు


సింహగిరి మాడ వీధిలో భక్తుల రద్దీ

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులతో దర్శనం క్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, అన్నప్రసాద భవనం, గంగధార, మాడ వీధులు కిటకిటలాడాయి. సుమారు 41 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా రూ. 30 లక్షల 98,300 ఆదాయం వచ్చింది.